# రాజన్న క్షేత్రం.. పోటెత్తిన భక్తజనం

కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజన్న ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే ధర్మగుండంలో స్నానం చేసి, తలనీలాలను సమర్పించుకుని, తామెత్తు బంగారం(బెల్లం)ను పంచిపెట్టారు. తర్వాత క్యూలో నిలబడి రాజన్నను దర్శించుకుని కోడెమొక్కు చెల్లించుకున్నారు. తర్వాత వివిధరకాల పూజలు చేశారు. ఆలయం ముందు భాగంలో కార్తీకదీపాలు వెలిగించుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు,అల్లి శంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్స్ చెక్కిళ్ల అశోక్, సంకెపల్లి పవన్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి పరిస్థితిని ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేశారు., వివిధ ఆర్జిత సేవల ద్వారా ₹21 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. **- వేములవాడ టౌన్, డిసెంబర్ 8**


గర్భ గుడిముందు స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు


ఆలయ ఆవరణలో భక్తులు

# విద్యార్థుల ప్రగతిపై దృష్టిపెట్టాలి

**పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్**


మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి, డిసెంబర్ 8 : విద్యార్థుల హాజరు, ప్రగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రధానోపాధ్యాయులను జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి సమీకృత కలెక్టరేట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎంపిక చేసిన ఐదు పాఠశాలల హెడ్మాస్టర్లతో కలెక్టర్లతో ఐదు ముఖ్యమైన అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, పేరెంట్స్ టీచర్ సమావేశం ఏర్పాటు చేసి చర్చించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలకు సంబంధించిన లెస్సన్ ప్లాన్, టీఎల్ఎం తయారు చేసుకుని లెర్నింగ్ అవుట్ కమ్స్ రాబట్టాలని, ఉపాధ్యాయులు తరగతి గదిలో విద్యార్థులతో చేయిస్తున్న కృత్యాలను వాట్సాప్ గ్రూపుల ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులకు పంపించాలన్నారు. తల్లిదండ్రులతో ఏర్పాటు చేసే సమావేశంలో విద్యార్థుల ద్వారా ప్రదర్శనలు ఇచ్చే విధంగా చూడాలని, దీని ఫలితంగా పాఠశాలలో జరిగే బోధన, అభ్యాసాలపై నమ్మకం కలుగుతుందన్నారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ ద్వారా వచ్చే కూరగాయలను మధ్యాహ్న భోజనంలో ఉపయోగించాలని, అలాగే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ అంశాలను దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఈ నెలాఖరున తొలి మెట్టు, ఉన్నతి లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంపై సమీక్షిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డాక్టర్ పీఎం షేక్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణ కోసమే షీ టీంలు

**• ఏ సమస్య ఉన్నా నిర్భయంగా తెలుపాలి • సైబర్ క్రైం డీఎస్పీ రంగారెడ్డి**

జగిత్యాల కలెక్టరేట్/ జగిత్యాల టౌన్, డిసెంబర్ 8 : మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసమే షీ టీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా తెలియచేయాలని సైబర్ క్రైం జగిత్యాల డీఎస్పీ రంగారెడ్డి తెలిపారు. షీ టీం, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, వుమెన్ సేఫ్టీ, సైబర్ క్రైమ్స్ విభాగాలపై పొలాసలోని వ్యవసాయ డిగ్రీ కళాశాలలో శుక్రవారం న్యూఢిల్లీ డైరెక్టర్ ఆఫ్ ఎన్ఎస్ఎస్ జీవోఐ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మహిళలు, పిల్లలు, విద్యార్థుల రక్షణకు పోలీసు శాఖ పటిష్ట రక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు.


పాల్గొన్న అగ్రికల్చరల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు


మాట్లాడుతున్న డీఎస్పీ రంగారావు

మానవ అక్రమ రవాణాను నిర్మూలించేందుకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేశామన్నారు. మహిళలపై పెరుగుతున్న వేధింపుల నుంచి కాపాండేందుకు పోలీసు శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. షీ టీంలను ఏర్పాటు చేసి విద్యార్థులు, మహిళలకు అవగాహన కల్పిస్తూ వారికి భరోసాతోపాటు రక్షణ కల్పిస్తున్నామన్నారు. సామాజిక మాధ్యమాల వినియోగం విషయంలో మహిళలు, విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఫొటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. వేధింపులకు గురిచేసేవారు, ఆకతాయిలకు సంబంధించి డయల్ 100కు లేదా షీ టీం 8712670783 నంబర్‌కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్లలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, షీ టీం ఏఎస్ఐ వలీ బేగ్, వుమెన్ పీసీలు పూజిత, సౌజన్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలి

**రెండోసారి గెలిపించిన జగిత్యాల ప్రజలకు రుణపడి ఉంటా • ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్**

జగిత్యాల కలెక్టరేట్/ సారంగాపూర్, డిసెంబర్ 8 : ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తక్షణమే వాటిని అమలు చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. జగిత్యాల ఎమ్మెల్యేగా వరుసగా రెండోసారి గెలిచిన నేపథ్యంలో జగిత్యాల పట్టణ, నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్‌లో ఆయనను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనులు, అందించిన సంక్షేమ పథకాలను చూసే ప్రజలు తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. వరుసగా రెండోసారి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వరి ధాన్యంతో పాటు అన్ని పంటలకూ ప్రతి క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.


ఆది శ్రీనివాస్‌ను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

# ఎమ్మెల్యేకు ఆశీర్వచనం

వేములవాడ, డిసెంబర్ 8: వేములవాడ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆది శ్రీనివాస్‌ను శుక్రవారం రాజన్న ఆలయ ఉద్యోగులతో పాటు పలువురు పోలీస్, ఇతర శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. రాజన్న ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సంకెపల్లి హరికిషన్ , ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. రాజన్న ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, అర్చకులు ఆయనకు వేదోక్త ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.


విజేత జట్టుకు బహుమతిని అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

# క్రీడలతో మానసికోల్లాసం

**• జడ్పీ చైర్‌పర్సన్ అరుణ • రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల విజేతలకు బహుమతుల ప్రదానం**

కోనరావుపేట, డిసెంబర్ 8: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, ఆటలతో మానసికోల్లాసం కలుగుతుందని జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. మరిమడ్ల గ్రామంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలో బాలుర రెండో ఈఎంఆర్ఎస్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మూడు రోజుల నుంచి కొనసాగుతుండగా, శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్రీడాకారులు తమ ప్రతిభను కనబర్చి విజేతలుగా నిలువగా, జడ్పీ చైర్‌పర్సన్ అరుణ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సర్పంచ్ అశోక్, ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


మొహియుద్దీన్

కోనరావుపేట, డిసెంబర్ 8: మండలంలోని ధర్మారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పీఈటీ ఎస్‌కే మొహియుద్దీన్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లాలో జరుగనున్న పోటీల్లో పీఈటీగా వ్యవహరించనున్నారు. మొహియుద్దీన్‌ను ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, సర్పంచ్ గున్నాల అరుణ, ఎస్ఎంసీ చైర్మన్ మాధవి, హెచ్ఎం మురళినాయక్, టీచర్లు అభినందించారు.